



## ప్రైవేట్ విద్యాసంస్థల్లో

# ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు
తక్కల్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. అఖిల భారత విద్యార్థి సమైక్య (ఎఐఎస్ఎఫ్) హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ అధ్యక్షతన విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టడం, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడం, ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించి విద్యను బలోపేతం చేయడం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్య అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, దానిని వ్యాపార వస్తువుగా మార్చే విధానాలను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, విద్యార్థుల హక్కుల సాధన కోసం విద్యార్థి నాయకులు నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను 7,000 నుండి 4,000కు కుదించే ఆలోచనపై చేసిన వ్యాఖ్యలు ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన సమయంలో వాటి సంఖ్యను తగ్గించే సంకేతాలు ఇవ్వడం విద్యా హక్కును బలహీనపరిచే చర్యగా ప్రజలు భావించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఈ వ్యాఖ్యలపై స్పష్టత ఇవ్వాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనుమతులు, ప్రమాణాలు లేకుండా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యా ప్రమాణాలను ఉల్లంఘించే సంస్థల గుర్తింపులను రద్దు చేయాలని కోరారు. విద్యారంగంలో పెరుగుతున్న ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ ధోరణులు సామాన్య, మధ్యతరగతి కుటుంబాల విద్యా అవకాశాలను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా ప్రైవేట్ రంగానికి ప్రోత్సాహం ఇవ్వడం సామాజిక అసమానతలను మరింత పెంచుతుందని పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, టిఆర్ఎస్వీ, పిడిఎస్‌యు, ఎఐఎఫ్డీఎస్, పిడిఎస్‌యు, యుఎస్ఎఫ్ఐ, ఎబిఎస్ఎఫ్, బిఎస్ఎఫ్, డిఎస్ఎ, ఎస్ఎస్ఎఫ్ తదితర మొత్తం 11 మంది విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలోని విద్యారంగ పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలు, ప్రభుత్వ విద్యాసంస్థలలో నెలకొన్న లోపాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు భాషబోయిన సంతోష్, రాచకొండ రంజిత్, బైరిపాక నరేష్, మాస్ సావిత్రి, మర్రి మహేష్, మంద నరేష్, రాజేష్ నాయక్, బొట్ల మనోహర్, కామ్రేడ్ శివ, చార్వాక, నరేష్ తదితరులు మాట్లాడుతూ ప్రత్యేకంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. విద్య హక్కు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల పరిరక్షణ కోసం విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో భవిష్యత్తులో దశలవారీగా, అవసరమైతే నిరవధికంగా ఉద్యమాలు చేపట్టాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్యవాదులు ఈ పోరాటాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీపతి వినయ్, బొజ్జ జ్యోతి, జక్కుల భాను ప్రసాద్, అజయ్ లతోపాటు తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## టిజిపిఎస్‌సి ఫీజుల పెంపుతో

# నిరుద్యోగులపై ఆర్థిక భారం

ఎఐవైఎఫ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ఇటీవల పలు ఉద్యోగ నోటిఫికేషన్లలో దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజును రూ.200 నుంచి రూ.ఒక వెయ్యికి పెంచడం ద్వారా నిరుద్యోగ యువతపై తీవ్ర ఆర్థిక భారం మోపిందని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి విమర్శించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసే అవకాశాన్ని కేవలం డబ్బున్న వారికి మాత్రమే పరిమితం చేసే విధంగా ఈ నిర్ణయం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెంచిన ఫీజులను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది. పెంచిన ఫీజులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ప్రతినిధులు శుక్రవారం నాంపల్లిలోని టిజిపిఎస్‌సి కార్యాలయంలో అదనపు కార్యదర్శి సరితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో దరఖాస్తు ఫీజులను నాలుగు రెట్లు పెంచడం నిరుద్యోగులపై అదనపు భారమని పేర్కొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు రూ.500, ఓసి, బిసి అభ్యర్థులకు రూ.ఒక వెయ్యి ఫీజు నిర్ణయించడం అన్యాయమన్నారు. ఒకే శాఖలోని పోస్టులను కూడా వేర్వేరు నోటిఫికేషన్లుగా విడుదల చేయడం వల్ల అభ్యర్థులు ప్రతి నోటిఫికేషన్‌కు విడివిడిగా ఫీజులు చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇటీవల రోడ్లు భవనాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఇఇ) పోస్టులు, కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులు, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులకు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఒక అభ్యర్థి కేవలం దరఖాస్తులకే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్. బాలకృష్ణ, రాష్ట్ర సమితి సభ్యుడు షేక్ మహమూద్ పాల్గొన్నారు.



# రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాల్సిందే : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అనుమతులేని పాఠశాలలను గుర్తించి వాటి పేర్లు బహిర్గతం చేయడంతో పాటు ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో జిఓ నెంబర్ 1, 42, 91 అమలు చేసే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్రంలో పాఠశాల విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల విద్యా అడిషనల్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల వారు నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ ఫీజుల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, టెక్నో, ఈ టెక్నో, వరల్డ్, ఒలంపియాడ్, వంటి పేర్లతో ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఇష్టానుసారంగా ఫీజులు పెంచుకున్నారని, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయకపోవడంతో విద్యాశాఖ నిబంధనలు పాటించకుండా పాఠశాలలు నిర్వహణ చేస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలోనే పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయిస్తూ పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చుతున్నారని మండిపడ్డారు.

తెలంగాణ రాష్ట్రంలో జూన్ 15 నుండి పాఠశాలలు పునఃప్రారంభం నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు అందించాలని కోరారు. అనేక పాఠశాలల్లో టీచర్ల కొరత ఉన్నందున విద్యార్థులు చదువులకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు రూపొందించడంతో పాటు మధ్యాహ్న భోజనం ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అనిల్, చైతన్య యాదవ్, రాష్ట్ర నాయకులు మురళి, ఉదయ్ పాల్గొన్నారు.

## ఆపరేషన్ 'నన్హే ఫరిష్తే'లో 512 మంది చిన్నారులకు రక్షణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణమధ్య రైల్వే (ఎస్‌సిఆర్) పరిధిలోని రైల్వే రక్షణ దళం (ఆర్‌పిఎఫ్) 'ఆపరేషన్ నన్హే ఫరిష్తే' కింద జనవరి నుంచి మే 31 వరకు 512 మంది తప్పిపోయిన, కుటుంబాలకు దూరమైన లేదా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను రక్షించి పునరావాసం కల్పించింది. రైల్వే స్టేషన్లు, రైళ్లలో గుర్తించిన ఈ చిన్నారుల్లో 421 మంది బాలురు, 91 మంది బాలికలు ఉన్నారు. రక్షించబడిన చిన్నారులను సంబంధిత బాలల సంక్షేమ కమిటీలకు (సిడబ్ల్యుసి) అప్పగించి అవసరమైన సంరక్షణ, పునరావాస చర్యలు చేపట్టేలా ఆర్‌పిఎఫ్ చర్యలు తీసుకుంది. చిన్నారుల రక్షణలో ఆర్‌పిఎఫ్ చేస్తున్న సేవలకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది. గత ఏడాది 2025లో మొత్తం 1,622 మంది చిన్నారులను, 2024లో 1,390 మంది చిన్నారులను ఆర్‌పిఎఫ్ రక్షించి కుటుంబాలకు చేర్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో చిన్నారుల భద్రత విషయంలో ఆర్‌పిఎఫ్ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని స్పష్టమవుతోంది. ఆపరేషన్ నన్హే ఫరిష్తేలో భాగంగా రైల్వే స్టేషన్లు, రైళ్లలో ప్రత్యేక నిఘా నిర్వహిస్తూ ప్రమాదంలో ఉన్న చిన్నారులను గుర్తిస్తున్న ఆర్‌పిఎఫ్, బాలల సంరక్షణ సంస్థలతో సమన్వయం చేసుకుని తక్షణ సహాయం అందిస్తోంది. అలాగే చిన్నారులలో కనిపించే మానసిక ఒత్తిడి, అసురక్షిత పరిస్థితులను గుర్తించేలా ఆర్‌పిఎఫ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవవ ఆర్‌పిఎఫ్ సిబ్బందిని అభినందించారు.

చిన్నారుల రక్షణలో ఇదే నిబద్ధత, అప్రమత్తతతో ముందుకు సాగాలని సూచించారు. రైల్వే ప్రయాణికులు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని, రైళ్లలో లేదా స్టేషన్లలో ఒంటరిగా ఉన్న లేదా ఇబ్బందుల్లో ఉన్న చిన్నారులు కనిపిస్తే వెంటనే రైల్వే హెల్ప్‌లైన్ 139కు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు సీజ్

రాష్ట్ర వ్యాప్తంగా 25,987 విద్యాసంస్థల వాహనాలు
ఈనెల 15 నుంచి ప్రత్యేక తనిఖీలు
జెటిసి చంద్రశేఖర్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో జూన్ 15 నుంచి పాఠశాలలు, విద్యాసంస్థలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రవాణా శాఖ ప్రత్యేక తనిఖీ డ్రైవ్ చేపట్టనుందని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. విద్యార్థులను రవాణా చేసే అన్ని విద్యాసంస్థల బస్సులు, ఇతర వాహనాలు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఫిట్‌నెస్ లేని వాహనాలు, అనుమతికి మించి విద్యార్థులను ఎక్కించే (ఓవర్‌లోడ్) వాహనాలు, భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ముఖ్యంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ (పియుసి) చెల్లుబాటులో ఉన్నాయా?, వాహనాల్లో అనుమతించిన సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్నారా?, డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, తగిన అనుభవం ఉందా?, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్ వంటి భద్రతా సౌకర్యాలు ఉన్నాయా?, బ్రేకులు, టైర్లు, లైట్లు తదితర యాంత్రిక భాగాలు సక్రమంగా పనిచేస్తున్నాయా?, విద్యార్థుల భద్రత కోసం అటెండర్‌ను నియమించారా? అనే వాటిపై ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 25,987 విద్యాసంస్థల బస్సులు ఉండగా, వాటిలో 22,158 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయని చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. మిగిలిన 3,829 బస్సులు వెంటనే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసి సర్టిఫికెట్ పొందాలని సూచించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్..**

ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న లేదా ఓవర్‌లోడ్ చేస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేయనున్నట్లు చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం వాహన యజమానులు, డ్రైవర్లు, సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థులను రవాణా చేసే వాహనాల నిర్వహణ, భద్రతా ప్రమాణాల అమలు, నిబంధనల పాటింపు పూర్తిగా పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల బాధ్యతేనని ఆయన స్పష్టం చేశారు.

**తల్లిదండ్రులకు విజ్ఞప్తి..**

అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించే వాహనాల్లో పిల్లలను పంపవద్దని తల్లిదండ్రులకు సూచించారు. తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని లేదా ఓవర్‌లోడ్ వాహనాలు సీజ్ చేయబడితే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని, తమ పిల్లలు ప్రయాణించే వాహనాల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలు, అనుమతులపై ముందుగానే నిర్ధారించుకోవాలని జెటిసి చంద్రశేఖర్ గౌడ్ పేర్కొన్నారు.

## సముద్ర తీరం లేకపోయినా..

# లాజిస్టిక్స్ హబ్‌గా తెలంగాణ

'లాజిస్టిక్స్ పాలసీ 2.0'తో గ్లోబల్ డెస్టినేషన్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దనున్న ప్రభుత్వం : మంత్రి శ్రీధర్ బాబు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సముద్ర తీరం లేకపోవడం తెలంగాణకు బలహీనత కాదని, దానినే వ్యూహాత్మక ప్రయోజనంగా మార్చుకుని రాష్ట్రాన్ని అంతర్జాతీయ లాజిస్టిక్స్ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

'తెలంగాణ రైజింగ్–2047' విజన్‌కు అనుగుణంగా లాజిస్టిక్స్ రంగాన్ని ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్–2026'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, ఎగుమతుల సన్నద్ధత సూచీలో తెలంగాణ దేశంలో ఎనిమిదో స్థానంలో, సముద్ర తీరం లేని రాష్ట్రాల్లో రెండో స్థానంలో నిలవడం రాష్ట్ర పారిశ్రామిక సామర్థ్యానికి నిదర్శనమన్నారు. అలాగే మర్చండైజ్ ఎగుమతుల్లో దేశంలో ఏడో స్థానాన్ని సాధించడం తెలంగాణ వేగవంతమైన అభివృద్ధిని ప్రతిబింబిస్తోందన్నారు. రాష్ట్రంలో 'లాజిస్టిక్స్ పాలసీ 2.0' అమలు ద్వారా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టులు, బాండెడ్ వేర్‌హౌజ్‌లు, ఆధునిక లాజిస్టిక్ పార్కుల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడంతో పాటు, కృత్రిమ మేధస్సు (ఎఐ), మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక సాంకేతికతలను లాజిస్టిక్స్ రంగంలో విస్తృతంగా వినియోగించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్, రైల్ కనెక్టివిటీ, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రేడ్ ఏ వేర్‌హౌజింగ్, ఆటోమేషన్, డిజిటల్ లాజిస్టిక్స్ ప్లాట్‌ఫార్మ్స్, గ్రీన్ మొబిలిటీ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని రకాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు ఆర్. రవికుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కేకే మహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గరిమెళ్ల, షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ కమిటీ చైర్మన్ కమల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వారం రోజులు వర్షాలు

పలు జిల్లాలకు భారీ వర్షాల సూచన
ఉరుములు-మెరుపులతో కూడిన ఈదురుగాలులు
హెచ్చరికలు జారీ చేసిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా రాగల వారం రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం వేగంగా మారుతోంది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తం చేశారు.

శుక్రవారం సాయంత్రం విడుదల చేసిన వాతావరణ బులెటిన్ ప్రకారం, జూన్ 13 ఉదయం వరకు మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అదే సమయంలో ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో వడగాల్పుల పరిస్థితులు కొనసాగవచ్చు అన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. శనివారం, ఆదివారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఆదివారం నుంచి జూన్ బుధవారం వరకు నల్లగొండ, సూర్యాపేట, జనగాం, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కొనసాగే అవకాశం ఉందన్నారు.

బుధవారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గనున్నాయి. శుక్రవారం ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదైనట్లు తెలిపారు. మిగిలిన జిల్లాల్లో 36 నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అయితే జూన్ సోమవారం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు.


GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగరపాలక సంస్థ

| NIT No. | పని వివరణ | అంచనా విలువ / ECV | డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | ఇఇ / ఎస్ఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 15 | 1 పని కొరకు, రాజేంద్రనగర్ జోన్‌లోని రాజేంద్రనగర్ సర్కిల్-19లో 900 మి.మీ. వ్యాసం కలిగిన పైపుల అనుసంధాన పనుల కోసం. | రూ.9.80 లక్షలు | తేది: 12.06.206 సా.4.30 గం.లకు | తేది: 15.06.2026 సా.4.40గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్ర నగర్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9989930608. ఇ-మెయిల్: eec11.ghmc2@gmail.com |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ సర్కిల్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 4188-PP/CL/ADVT/2026-27, Date: 12-06-2026

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్

| NIT No & Date | పని వివరణ | అంచనా విలువ | ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 10/DB/EE-II/Bowenpally Circle/MMC/2026-27, తేది: 12.06.2026 | 1. ఎంఎంసి, మల్కాజ్‌గిరి జోన్, బోయిన్‌పల్లి సర్కిల్-03 పరిధిలో 5 నెలల కాలానికి వివిధ ప్రాంతాలలో BT / CC ప్యాచ్ మరియు క్యాచ్‌పిట్ మరమ్మతు పనులతో కూడిన రహదారి భద్రతా నిర్వహణ పనులు (మొత్తం 5 పనులు). | రూ.77.80 లక్షలు | 15.06.206 సా.5.00 గం.లకు | 18.06.2026 సా.5.00 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి.
DIPR R.O. No. : 4224-PP/CL/ADVT/2026-27, Date: 12-06-2026

సూపరింటెండెంట్ కార్యాలయం
ఉస్మానియా జనరల్ హాస్పిటల్ : హైదరాబాద్

Rc.no. STNR/A14/OGH/HYD/2026/845, టెండరు ప్రకటన తేదీ: 11-06-2026

విషయం:-2026-28 కాలానికి (రెండు సంవత్సరాలు) ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వినియోగం కోసం నిర్దిష్ట స్టేషనరీ వస్తువులు మొదలైన వాటిని సమకూర్చుకోవడం గురించి.

సూచన:- ఆమోదించబడిన కార్యాలయ నోట్ Rc.No. STNR/A14/OGH/HYD/2026, తేదీ: 11-06-2026

@@@@@@

హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వినియోగం కోసం 2026-28 కాలానికి (రెండు సంవత్సరాలు) నిర్దిష్ట స్టేషనరీ వస్తువులు మొదలైన వాటిని సమకూర్చుకోవడానికి అధీకృత డీలర్లు / ఏజెన్సీలు / సేవా ప్రదాతల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి.

01. టెండర్ ఫారం రుసుము రూ. 5,000/- ను OGH లోని NPR బ్లాక్, క్యాష్ సెక్షన్‌లో చెల్లించాలి.
02. టెండర్ ఫారాల విక్రయం 15-06-2026 నుండి 20-06-2026 వరకు, అన్ని పని దినాలలో ఉదయం 10.30 నుండి సాయంత్రం 4.00 గంటల మధ్య OGH స్టేషనరీ విభాగంలో జరుగుతుంది.
03. సీల్డ్ టెండర్ సమర్పణకు చివరి తేదీ: 22-06-2026. దీనితో పాటు "సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్" పేరిట రూ. 1,00,000/- విలువైన డి.డి. (DD)ని EMDగా జతచేసి OGH ఇన్‌వార్డ్ విభాగంలో సమర్పించాలి.
04. వెండర్లు / ఏజెన్సీల ప్రతినిధుల సమక్షంలో, 24-06-2026న మధ్యాహ్నం 12.30 గంటలకు OGH సూపరింటెండెంట్ ఛాంబర్‌లో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి.

ఏదైనా లేదా అన్ని టెండర్లను ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా అంగీకరించడానికి / తిరస్కరించడానికి / రద్దు చేయడానికి హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్, సూపరింటెండెంట్‌కు పూర్తి అధికారాలు ఉంటాయి.

భవదీయులు
సం/- సూపరింటెండెంట్
ఉస్మానియా జనరల్ హాస్పిటల్
హైదరాబాద్.

DIPR R.O. No. : 4211-PP/CL/ADVT/2026-27, Date: 12-06-2026

ఇల్లందు మున్సిపాలిటీ కార్యాలయం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

నోటీసు. Roc. No. E1/70/2026, కొటేషన్ నోటీసు తేదీ: 12.06.2026

పనుల వివరాలు:

1) ఆలం (Alum), సున్నం సరఫరా, 2) సానిటేషన్ PPE కిట్లు, మలాథియాన్, థెమోపాస్ (Thermopous/Fogging chemical), బయో-టెక్స్ రసాయనాలు, కోడ్ యూనిఫాంల సరఫరా, 3) ఫ్రేమ్‌లతో కూడిన మరియు లేని ఫ్లెక్సీలు, ఆర్ట్ పెయింటింగ్‌లు & వాల్ రైటింగ్ పెయింటింగ్స్, 4) నీటి పంపిణీ పైప్‌లైన్ పనులు, ఫౌండ్రీ పనులు, వివిధ సామర్థ్యాల 1.5 HP, 2.0 HP, 3.0 HP, 5.0 HP,7.5 HP, 15 HP, 20 HP, 50 HP మోటార్ల రీవైండింగ్ (మోనో బ్లాక్ & సబ్‌మెర్సిబుల్), 5) సిరీస్ లైటింగ్, ఫ్లడ్ లైటింగ్, బారికేడ్లు, సౌండ్ సిస్టమ్, అలంకరణ, జనరేటర్, టెంట్, కుర్చీలు, బల్లలు, సైడ్ వాల్స్, తాగునీటి ఏర్పాట్లు, 6) కార్యాలయ వాహనాల (ఆటోలు, ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు) మరమ్మతులు, 7) సిస్టమ్‌లకు సర్వీసింగ్, ప్రింటర్ల కొనుగోలు మరియు రీఫిల్లింగ్, 8) కార్యాలయ అవసరాలకు వాహనాల అద్దె (కార్లు, JCB, డోజర్, చైన్‌మెషీన్, ట్రాక్టర్, ఆటోలు - మైక్ అనౌన్స్‌మెంట్ కోసం), 9) వీధి దీపాల అమరికకు అవసరమైన వస్తువులు, 10) కార్యాలయ స్టేషనరీ వస్తువులు, 11) టెండర్ షెడ్యూల్ పుస్తకాలు, 12) ఘన వ్యర్థాల నిర్వహణ (Solid Waste Management) యంత్రాల నిర్వహణ మరియు ఆపరేషన్.

*గమనిక: పైన పేర్కొన్న పనులకు సంబంధించి కొటేషన్ ధరలను ప్రతి అంశానికి అనుగుణంగా గంటకు, సంఖ్యలు, లీటర్లలో, జాబ్ వర్క్ పద్ధతిలో, రోజువారీ ప్రాతిపదికన, కిలోలు లేదా చదరపు మీటర్ల వంటి కొలమానాలలో పేర్కొనాలి.*

ఆసక్తి గల కాంట్రాక్టర్లు / ఏజెన్సీలు తమ పత్రాలను సీల్ చేసిన కవరులో సంబంధిత అధికారికి సమర్పించాలి.

**కొటేషన్లు మరియు ఆసక్తి వ్యక్తీకరణ (EOI) స్వీకరణ తేదీలు:** 15.06.2026 నుండి 17.06.2026 సాయంత్రం 4:30 గంటల వరకు.

**కొటేషన్లు (EOI) తెరిచే తేదీ:** 17.06.2026, సాయంత్రం 5:00 గంటలకు.

సమర్పించిన సీల్డ్ కొటేషన్లు సంబంధిత సంస్థల ప్రతినిధుల సమక్షంలో తెరవబడతాయి. మరిన్ని వివరాల కోసం మున్సిపల్ కమిషనర్, ఇల్లందు మున్సిపాలిటీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారిని సంప్రదించండి.

**సంప్రదించవలసిన వివరాలు: ఇల్లందు మున్సిపాలిటీ.**
**మొబైల్ నంబర్: 9849905883**

సం/- కమిషనర్
ఇల్లందు మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 4172-PP/CL/ADVT/2026-27, Date: 12-06-2026